



జావో ఛోడ్ కర్..' పాటలో ఓ చోట 'యే శామ్ ఢల్ తో లే జరా..' అనే దగ్గర పొద్దువాలిపోతున్నట్టుగా, 'నశే కే ఘూంట్ పీ తో లూ' అన్న దగ్గర మత్తు ఎక్కినట్టుగా రఫీ పలికిన తీరు.. వీనులకే కాదు, మనసుకూ హాయినిస్తుంది. ఒక్కపాటలోనే ఇన్ని సంగతులేస్తే వందల రాగాల్లో వేల పాటల్లో ఎన్నేసి వింతలు, కవ్వింతలు ఉండి ఉంటాయో ఊహించుకోండి. రఫీ గొంతుతో హిట్టయిన పాటలే కాదు, హీరోలూ ఉన్నారు. అందులో ఒకరు షమ్మీకపూర్. ఉరిమే ఉత్సాహం షమ్మీ సొంతం. కొండగాలిలా పాట ఊపుమీ దుంటే ఆ హీరో తెగ ఊగిపోయేవాడు. పిల్లగాలిలా ఉంటే తనువంతా మల్లెతీగలా మెలికలు తిప్పేసేవాడు. క్షణం కుదురుగా ఉండని అతగాడు ఏ పాటకు ఎలా నర్తిస్తాడో, ఏ పదానికి ఎలా స్పందిస్తాడో.. అచ్చంగా అలాగే పదాలు పలికి విస్మయపరిచేవాడు రఫీ. అందుకే కాబోలు, రఫీ మరణవార్త వినగానే షమ్మీ 'ఐ లాస్ట్ మై వాయిస్..' అని కదలక, మెదలక కాసేపు నిశ్చేష్టుడయ్యాడు. వీళ్లిద్దరి కాంబోలో వచ్చిన ప్రతి పాటా ఇలా ఎవర్‌గ్రీన్ లిస్ట్‌లో చేరిందే!

రఫీ రాకతో సినీ సంగీత దర్శకులూ ఉప్పొంగిపో యారు. నౌషాద్ మరింత జటిలమైన స్వరాలు కూర్చడమే పనిగా పెట్టుకున్నాడు. ఓపీ నయ్యర్ ఓపికగా విభిన్న ట్యూన్‌లను కంపోజ్ చేయడం మొదలుపెట్టాడు! కారణం ఏ దివ్యలోకంపైనో అలకబూని మానవుడిగా జన్మించిన రఫీ అందుబాటులో ఉన్నప్పుడే తమలోని స్వర సారస్వ తాన్నంతా రంగరించి బాణీలు కట్టాలన్న తపన వారిది!! తన మార్కు సంగతులు వేసి, తనకే సొంతమైన డైనమి క్స్‌తో వారందరి తపస్సునూ ఫలింపజేసేవాడు రఫీ. ఎస్డీ బర్మన్, రాజేష్ రోషన్, ఖయ్యాం, జయదేవ్, సి.రామ చంద్ర, చిత్రగుప్త, ఆర్డీ బర్మన్, శంకర్-జైకిషన్, కళ్యాణ్ జీ- ఆనంద్ జీ, లక్ష్మీకాంత్-ప్యారేలాల్ ద్వయం ఇలా 1950 నుంచి 1980 వరకు ఎందరెందరో సంగీత దర్శ కులకు మేలిరత్నాల్లాంటి పాటలు అందించాడు రఫీ సాబ్.

1970 తర్వాత రఫీ గొంతులో చిన్న ఇబ్బంది తలె త్తింది. దాంతో పాటల జోరు తగ్గింది. అప్పుడు కిషోర్ కుమార్ హవా మొదలైంది. రెండుమూడేండ్లు పూర్తిస్థా యిలో పాడలేకపోయాడు రఫీ. మళ్లీ గొంతు సవరించు కుని గళమెత్తాడు. హిందీ పాట మళ్లీ పొంగిపోయింది. ఆయన తుది శ్వాస విడిచే దాకా ఆ ప్రభంజనం అలాగే కొనసాగింది. తనకన్నా ముందు ఉన్న గొప్పగాయకుల నుంచి స్ఫూర్తి పొందిన ఈ మహా గాయకుడు.. తర్వాత వచ్చిన గీతకారులనూ అంతే ఆదర్శంగా తీసుకున్నాడు. కిషోర్ కుమార్‌కూ ప్లేబ్యాక్ పాడాడు. ఇద్దరూ కలిసి ఎన్నో మధురమైన గీతాలను ఆలపించారు. రఫీ జమానాలో ఆయనకు పోటీ అనుకునే గళం కల గాయకుడు మన్నాడే. శాస్త్రీయ సంగీతాన్ని ఆపోశన పట్టిన మన్నాడే ఓ సంద ర్భంలో 'రఫీ తర్వాతే నేనైనా, ఎవరైనా' అన్నాడంటే.. ఈ ఫకీర్ సాబ్ ఎంతటి విద్వాంసుడో అర్థం చేసుకోవచ్చు. తను సంగీతం అభ్యసించిన బడే గులాం అలీఖాన్, మరో హిందుస్థానీ సంగీత దిగ్గజం పండిత్ జస్‌రాజ్ వంటి లబ్ధ ప్రతిష్ఠులతోనూ పాటలు పంచుకున్నాడంటే రఫీ 'పా ట'వం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

ఈర్ష్య, అసూయ రఫీని ఎన్నడూ అంటుకోలేదు. గాయ కుడిగానే కాదు, వ్యక్తిత్వంలోనూ రఫీ మేరునగ ధీరుడు. గొప్ప గాయకుడిగా ఎంతగా ఆయన్ను అభిమానిస్తారో, మహోన్నతమైన వ్యక్తిత్వం కలవాడిగానూ అంతగా ఆరా ధిస్తారు. అందుకే, రఫీ అస్తమించిన పదేండ్ల తర్వాత వచ్చిన ఓ సినిమాలో 'నా ఫన్‌కార్ తుఝ్‌సా తేరే బాద్ ఆయా.. మహమ్మద్ రఫీ తూ బహుత్ యాద్ ఆయా' (నీ లాంటి కళాకారుడు మళ్లీ పుట్టడు. నువ్వు సదా గుర్తుం టావు) అని కీర్తించాడు రచయిత ఆనంద్ భక్షి. హిమశిఖ రమంత ఉన్నతస్థాయికి వెళ్లినా 'ఏక్ ఇంసాన్ హూ.. మై తుమ్హారీ తరాహ్..' అని రఫీ తనదైన శైలిలో వినమ్రంగా చెప్పినా... 'తారీఫ్ కరూ క్యా ఉస్‌కీ జిస్‌నే తుమ్హే బనాయా' (నిన్ను పుట్టించిన దేవుడిని ఎంత ప్రశంసించినా తక్కువే) అని రఫీసాబ్‌ను భువికి పంపిన ఆ దేవుడికి లక్షలసార్లు కృతజ్ఞతలు చెప్పినా తక్కువే! ■

## లతాతో పేచీ

మహ్మద్ రఫీ, లతా మంగేష్కర్ కాంబినేషన్ సూపర్‌హిట్. ఇద్దరూ కలిసి వందలాది డ్యూయెట్లు పాడారు. లతా దీదీ... రఫీసాబ్‌ని 'భయ్యా' అని సంబోధించేది. రఫీ కూడా అంతే ఆప్యాయంగా ఆమెను పలకరించేవాడు. ఇంత అభిమానంగా ఉండే వీళ్లిద్దరి మధ్య తెగని పేచీ వచ్చిపడింది. మ్యూజిక్ రికార్డింగ్ సంస్థలు సంగీత దర్శకులతోపాటు గాయకులకూ రాయల్టీ ఇవ్వా లనే చర్చ ఒకసారి తెరపైకి వచ్చింది. ఆ చర్చను లేవనెత్తింది లతాదీదీ. ఈ విషయంలో లత అభి ప్రాయంతో విభేదించాడు రఫీ. ఒకసారి పాడి, పారితోషికం తీసుకున్న తర్వాత ఆ పాటతో గాయ కులకు రుణం తీరిపోతుందన్నది రఫీసాబ్ భావన. పాట విజయవంతం కావడంలో భాగమైన గాయ కులకు రాయల్టీ రావడం ధర్మమని లతా నిశ్చితా భిప్రాయం. ఇదే విషయమై ఇద్దరి మధ్యా గొడవ ముదిరి పాకానపడింది. 1963లో ఓనాడు రఫీతో పాడేది లేదంది లత! 'నేనూ అంతే' అన్నాడు రఫీ. ఇద్దరి మధ్యా రాజీ యత్నాలు చాలా రోజులు సాగాయి. ఎవరూ బెట్టు వీడలేదు. చివరికి 1967లో ఓ కాన్సర్ట్‌లో ఎస్డీ బర్మన్ 'లత, రఫీ కలిసి పాడే పాట మీ కోసం' అని ప్రకటించాడు. ఎలాంటి శషభిషలు లేకుండా మళ్లీ కలిసి పాడారు. తర్వాత వందలాది పాటలు జంటగా ఆలపించారు. రఫీ గురించి చెబుతూ 'మచ్చలేని వ్యక్తి రఫీసాబ్. ఆయనతో అత్యధిక డ్యూయెట్లు పాడే అదృష్టం నాకే దక్కింది. రఫీ సాబ్ పాట వింటే.. భాష రానివాళ్లకు కూడా భావం అర్థమవు తుంది' అని కీర్తించింది లతా దీదీ!

## దటీజ్ రఫీ..



అప్పట్లో రికార్డింగ్‌లో ఒకే మైక్ ఉండేది. మేల్ సింగర్ తన పంక్తులు ఆలపించి పక్కకు తప్పుకొ న్నాక, ఫిమేల్ సింగర్ పాడేది. ఆమె పాడిన తర్వాత అతను. ఇలా సాగేది రికార్డింగ్. ఒకసారి రఫీ పాట రికార్డింగ్ ఉందని తెలిసి రఫీ స్నేహితుడు బాలీవుడ్ గీత రచయిత జావెద్ అఖ్తర్‌ను వెంటపె ట్టుకొని స్టూడియోకు వెళ్లాడట. అక్కడ అద్దాల గదిలో రఫీ, మరో గాయనితో కలిసి ఓ విరహ గీతం ఆలపిస్తున్నాడు. తన పంక్తులు పాడగానే.. గ్లాసు అందుకొని నీళ్లు తాగుతూ అద్దంలోంచి బయటికి చూశాడట. బయట ఉన్న తన స్నేహి తుణ్ని చూపులతోనే ఆప్యాయంగా పలకరించా డట. ఆ వచ్చిన వ్యక్తి 'ఎంత అందంగా పాడుతు న్నావ్' అన్నట్టుగా సైగ చేయగా.. దాన్ని అర్థం చేసుకొని 'అంతా ఆ దేవుడి దయ' అన్నట్టుగా చేతిని పైకి చూపాడట రఫీ. ఇంతలో గాయకురాలి పంక్తులు పూర్తయ్యాయి. ఆ వెంటనే రఫీ గళం విప్పాడు. మళ్లీ అంతకు మునుపు మూడ్, అదే స్వరంతో తన లైన్లు పూర్తిచేశాడు. దటీజ్ రఫీ!

## తెలుగులో కొన్ని..

హిందీ, పంజాబీ, మరాఠీ తదితర భాషల్లో వేల పాటలు పాడిన రఫీ తెలుగులోనూ కొన్ని గీతాలు ఆలపించారు. అవన్నీ సూపర్‌హిట్ జాబి తాలో చేరిపోయాయి. ఎన్టీఆర్ హీరోగా నటించిన 'భలేతమ్ముడు' సినిమాలో 'ఎంతవారు గానీ వేదాంతులైన గానీ..', 'ఇద్దరి మనసులు ఒక



టాయే సరిహద్దులు లేనే లేవాయే..', 'గోపాల బాల నిన్నే కోరి..' పాటలు బహుళ జనాదరణ పొందాయి. ఎన్టీఆర్ 'ఆరాధన' సినిమాలో 'నా మది నిన్ను పిలిచింది గానమై..' పాట ఈ తరాన్నీ మురిపిస్తుంది. 'అక్బర్ సలీం అనార్కలీ' సినిమా లోని 'సిపాయి నీకై ఎంత ఎంత వేచి ఉన్నానో..' పాట యూట్యూబ్‌లో మిలియన్ వ్యూస్ సొంతం చేసుకుంది.